క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



అలంపూర్: అలంపూర్ మండలం భీమవరం గ్రామానికి చెందిన సాయి ప్రసాద్ ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం రూ.4 లక్షలు, వడ్డేపల్లి మండలం తనగలకు చెందిన వీరయ్య ఆపరేషన్‌కు రూ. 2 లక్షల ఎల్‌ఓసీ చెక్కులను కర్నూల్‌లోని ఎమ్మెల్సీ చల్లా నివాసంలో ఎమ్మెల్యే విజయుడు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కలుగోట్ల సింగల్‌విండో చైర్మన్ గజేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేష్, రమేష్, నరసింహ, నాయకులు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు 44 మంది హాజరు

అలంపూర్ రూరల్: పది సప్లిమెంటరీ పరీక్షలకు 44మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. గురువారం ఇంగ్లిష్ పరీక్షకు 54 మంది విద్యార్థులకు గాను, 44 మంది హాజరయ్యారు. 10మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మధు, డిపార్ట్‌మెంటల్ అఫీసర్ వెంకట్‌నాయుడు తెలిపారు.

మెడికల్ కిట్లు అందజేత



మానవపాడు: మానవపాడు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలకు గురువారం మెడికల్ కిట్లు సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పారాసిట్‌మాల్, సిరఫ్ పారాసిటమాల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రామిసిటిన్ సిట్‌క్రీమ్ తదితర మెడికల్ కిట్లును పొందపర్చామన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు టీచర్లు పాల్గొన్నారు.

యూనిఫామ్స్ అందజేత



అలంపూర్ రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల స్కూల్ యూనిఫామ్స్‌ను గురువారం ఎంఈఓ అశోక్ కుమార్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. పట్టణంలోని ఐకేపీ భవనంలో మహిళా సంఘాల వారు కుట్టిన స్కూల్ యూనిఫామ్స్‌ను ఎంఈఓ అశోక్ కుమార్, ఏపీఎం ప్రవీణ లు అందజేసి మాట్లాడారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం రోజున విద్యార్థులు స్కూల్ యూనిఫామ్స్ వేసుకొని రావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్‌లు, సీసీలు, వీఓఏ ఉన్నారు.

అయిజ: మండలంలోని నౌరోజి క్యాంప్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు స్కూల్ యూనిఫాంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భద్రయ్య మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల విద్యాధికారి కార్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండల విద్యాధికారి రాజు ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నూతన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

అలంపూర్‌లో 68.4 మి.మీ.వర్షపాతం

అలంపూర్ రూరల్: మండలంలో బుధవారం రాత్రి 68.4 మిల్లీ మీటర్ల వర్షపా తం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం వేకువజామున వర కు కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని నదిఅగ్రహారం రోడ్డులో ఉన్న 33/11విద్యుత్ ఉపకేంద్రంలోని పాతపవర్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి విద్యుత్‌శాఖ అధికారులు గురువారం వాటి స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ సప్‌లైలో తరుచూ అంతరాయం ఏర్పడుతుండడంతో నూతనంగా 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మను ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యుత్ అంతరాయం లేకుండా సప్లై చేసేందుకు దోహదపడుతుందన్నారు.

కాలనీలో నీటి పరిశీలన

ఉండవెల్లి: మండలంలోని బైరాపురంలో వర్షానికి సీసీ రోడ్డుపై నీరు నిలవడంతో కాలనీ వాసుల ఇబ్బందులు అధికమయ్యాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి మద్దిలేటికి ప్రజలు సమస్యను తెలపడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గురువారం ఎంపీఓ పద్మావతి కాలనీలో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలించారు. నీటిని మోటర్ల ద్వారా పొలాల్లోకి పంపిస్తారని తెలిపారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి

ధరూరు: బడీడు పిల్లలందరు బడిలోనే ఉండాలని జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, ఐకేపీ సీసీ జయరాజ్‌లు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఐకేపీ, స్వయం సహాయక సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికి తిరిగి బడి బయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 0–5 సంవత్సరాల లోపు పిల్లలందరు అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని, 6–14 ఏళ్ల లోపు ఉన్న పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ వీఓఏ –2 పద్మ, గ్రామ సంఘం –2 అధ్యక్షురాలు ఖాజాబీ, సరోజమ్మ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ రాములు నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంవీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని బడిబాట కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలకు విద్యార్థులు పంపకుండా పత్తి పొలాల్లో పనులు చేయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని, రూ.50 వేల జరిమానా విధిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ మహాలక్ష్మి, ఆర్ఐ ఉదయ్‌కుమార్, ఎంవీఎఫ్ ఫౌండేషన్ సాయికుమార్, తదితరులు ఉన్నారు.

కేటీదొడ్డి: బడిబయట ఉన్న పిల్లలందరు బడిలో ఉండాలని ఉపాధ్యాయుడు జయన్న కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బడిబాటపై ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి, పొలాల వెంబడి తిరుగుతూ గ్రామ పెద్దలను కలిసి బడీడు పిల్లలను బడిల్లో చేరిృంచాలని ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రణీత, అమ్మ అదర్శ కమిటీ చైర్మన్ సవిత, ఎంవీఎఫ్ ఫౌండేషన్ కర్యకర్త జయరామ్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.



ధరూరులో బడిబాటలో పాల్గొన్న స్వయం సహాయక సంఘాల లీడర్లు, ఉపాధ్యాయులు

మాచర్లలో బడిబాట ర్యాలీ

గట్టు: మండలంలోని మాచర్లలో బడిబాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఎంవీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వలంటీర్ శృతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని శృతి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఎంవీఎఫ్ ఆర్గనైజర్ వీరేష్, మాజీ వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని ఉచితంగా లభిస్తాయని, విద్యావంతులైన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని, ఆరేళ్ల వయసు నుంచి 14 ఏళ్లలోపు వయసున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిద్దామని ఉపాధ్యాయులు కోరారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల ప్రభుత్వ పాఠశాలలో బడిబాట ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పలత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వంకటనర్సమ్మలు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.సమావేశంలో ఎంవీఎఫ్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, పాఠశాలల కమిటీ చైర్మన్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానవపాడు: బడుగు బలహీన వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకోని తెలంగాణ ప్రభుత్వం బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. మండలంలో బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాచర్లతో బడిబాట ర్యాలీ



మానవపాడులో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కొంకలలో విద్యార్థులకు అందే సౌకర్యాల గురించి వివరిస్తున్న ప్రధానోపాధ్యాయులు



ఉండవెల్లిలో ఇంటి వద్ద పిల్లలను బడికి పంపాలని తల్లులకు సూచిస్తున్న ఉపాధ్యాయులు

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ప్రారంభించారు. మండల కేంద్రంలోని పురవీధుల్లో ఉపాధ్యాయులు తిరుగుతూ పాఠశాలలో చిన్నారులను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: ప్రభుత్వ బడిలో మెరుగైన విద్య విద్యార్థులకు అందించి, వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేస్తున్నామని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. మండల కేంద్రంతో పాటు మాన్‌దొడ్డిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల సిబ్బంది, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నమూనాలు ల్యాబ్‌కు తరలింపు



మానవపాడు: మండల కేంద్రంలోని మనగ్రోమోర్ సెంటర్ నందు మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విత్తనాలు నాణ్యమైనవా? కావా తెలుసుకోవడానికి విత్తనాల నాణ్యత పరీక్షకు కోసం నమూనాలు తీసుకున్నామన్నారు. విత్తనాల ద్వారా సేకరించిన నమూనాలు హైదరాబాద్ ల్యాబ్‌కు తరలించామన్నారు. బోరవెల్లిలో 1, మానవపాడు 3 పత్తి, కంది విత్తనాల నమూనాలు సేకరించామన్నారు. విత్తనాల నమూన ఫలితాలు 20 రోజుల్లో వస్తాయన్నారు. ప్రభుత్వ గుర్తింపు లేని విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

గద్వాల అర్బన్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పరంజ్యోతి, జిల్లా కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో దళిత వాడల్లో విషజ్వరాలు రాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై ఈనెల 18నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తామన్నారు. 27, 8వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో కేవీపీఎస్ జిల్లా సామాజిక శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు విజయ్‌కుమార్, ఆంజనేయులు, సవారన్న, కర్రెప్ప, రాజు తదితరులు ఉన్నారు.

రైతుల అవసరాలను తీర్చాలి

గట్టు: వానాకాలం సీజన్ ప్రారంభమైన తరుణంలో రైతుల అవసరాలను గుర్తించి, తీర్చాలని ఎంపీపీ విజయ్‌కుమార్, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారుతో ఎంపీపీ విజయ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ వానాకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి నష్టపోకుండా అవగాహన కల్పించాలన్నారు. ఏఈఓలు గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ సాగులో సూచనలు చేయాలని కోరారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి, విద్యుత్ ఏఈ చెన్నయ్య, వివిధ గ్రామాలకు చెందిన వ్యవసాయ విస్తర్ణ అధికారులు పాల్గొన్నారు.



గట్టులో అధికారులతో సమీక్షను నిర్వహిస్తున్న ఎంపీపీ

సాగుకు సన్నద్ధమైన రైతులు

రాజోళి: మండలంలో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. రుతుపవనాలు రాకతో పాటు వర్షాలు కురవడంతో రైతులు సేద్యం పనులు ప్రారంభించారు. పలు చోట్ల పదునైన వర్షాలు కురవడంతో, రైతులు దుక్కులు దున్ని విత్తనాలు విత్తేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. పలుచోట్ల రైతులు విత్తనాలు వేస్తున్నారు. కంది, పత్తి తదితర విత్తనాలు కొనుగోలు చేసుకుని సిద్ధం చేసుకున్నారు. మండల కేంద్రంతో పాటు తూర్పుగార్లపాడు, తుమ్మిళ్ల, పచ్చర్ల, మాన్‌దొడ్డి తదితర గ్రామాల్లో రైతులు విత్తనాలు వేస్తున్నారు.



తూర్పుగార్లపాడు శివారులో కంది విత్తనాల కోసం పొలం సిద్ధం చేస్తున్న రైతు

ఆరోగ్య వివరాలు నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్యాధికారులు

గట్టు: గ్రామాల్లో 30 ఏళ్ల పైబడిన వారి ఆరోగ్య వివరాలను కుటుంబాల వారీగా రికార్డులతో పాటుగా ఆన్‌లైన్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని ఎన్‌సీడీ పోగ్రామ్ అధికారి డాక్టర్ రాజు ఏఎన్ఎం, ఆశావర్కర్లకు సూచించారు. గురువారం ఆరగిద్ద సబ్‌సెంటర్‌ను ఎన్‌సీడీ పోగ్రామ్ అధికారి రాజు సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో కుటుంబాల వారీగా ఆరోగ్య ప రీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అంద జేసి, వివరాలను నమోదు చేయాలన్నారు. ఆయుస్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఇంతవరకు చేయలేదని, ఇద్దరు మాత్రమే చేశారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్యాంసుందర్, మక్సూద్, ఏఎన్ఎం రావేల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని డ్యాంరోడ్డులో ఉన్న సబ్ స్టేషన్ మరమ్మతు పనుల సందర్భంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని గంజిపేట, కొత్తబస్టాండు, సుంకులమ్మ మెట్టు, రాజావీధి, షేరెల్లీవీధి, గాంధీచౌక్, పాత కూరగాయల మార్కెట్, రాఘవేంద్ర కాలనీ, కుంట వీధి, చేపల మార్కెట్, దౌదర్‌పల్లి, పిల్లిగుండ్ల, అయిజ రోడ్డు ఏరియాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయ భూముల కౌలు వేలం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పెద్ద దిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయ భూములను నెల 10వ తేదీన ఉదయం 12 గంటలకు రెండేళ్లకు గాను బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త జయసింహయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి సంబంధించిన మొత్తం 36 సర్వే నెంబర్లలోని వ్యవసాయ భూములకు కౌలు వేలం నిర్వహిస్తారని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన రైతులు సర్వే నెంబర్ ఒక్కింటికి రూ.1000 చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వేలం ముగిసిన అనంతరం డిపాజిట్ పోను మిగిలిన 50శాతం నగదును ఆలయంలో చెల్లించి బుకింగ్ రశీదు తీసుకోవాలని పేర్కొన్నారు.

వేప పిండిని సద్వినియోగం చేసుకోండి

అయిజ: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు ఉత్పత్తి దారుల సంఘం ద్వారా మండల కేంద్రంలో వేప పిండిని విక్రయిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌పీఓ అకౌంటెంట్ వినిత్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. నూనె తీయని వేపపిండి 40 కేజీల బస్తా రూ.950కు విక్రయిస్తున్నామని, బయటి మార్కెట్ ధరల కంటే తక్కువని పేర్కొన్నారు. సమాచారం కోసం 9177022500నకు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

మానవపాడు: ఆరోగ్యకేంద్ర పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏఎన్ఎమ్‌లు, ఆశలు దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించి పాజిటివ్ వచ్చిన వారిని ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సీడీపీఓ సుజాత, డాక్టర్ రిజ్వానా తాన్వీర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎమ్‌, ఆశలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్‌డీడీ జాతీయ నూలిపురుగు దినోత్సవం సందర్భంగా 1–19 సంవత్సరాలు నిండిన పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఈ నెల 27న అందిస్తామన్నారు. గ్రామాల్లో పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యకేంద్రంలో మళ్లీ వైద్యపరీక్షలు చేసిన అనంతరం బీపీ, షుగర్ నిర్ధారణ అయితే ప్రతినెల మందులు అందిస్తామన్నారు. వర్షాకాలంలో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యంపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ సత్యానారాయణ, సూపర్‌వైజర్ చంద్రన్న, ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు, సోని, ఏఎన్‌మ్‌లు ఆశలు పాల్గొన్నారు.



మానవపాడు ఆరోగ్యకేంద్రంలో నులిపురుగుల దినోత్సవ కరపత్రం చూపుతున్న అధికారులు

పోస్టాఫీస్ ఎదుట ఉపాధి కూలీల ఆందోళన

గట్టు: గట్టులోని పోస్టాఫీసు మధ్యాహ్నం ఒంటి గంటైనా తెరచుకోలేదు. దీంతో ఉపాధి హామీ పథకం కూలీలు డబ్బుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. గట్టులోని నేతాజీచౌక్‌లో పోస్టాఫీసు దగ్గర గురువారం ఉపాధి కూలీలు డబ్బుల కోసం ఖాతా పుస్తకాలతో విత్ డ్రా చేసుకునేందుకు ఎదురు చూశారు. 10 గంటలకు తెరచుకోవాల్సిన పోస్టాఫీసు మధ్యాహ్నం ఒంటి గంట వరకు తెరచుకోలేదు. దీంతో కూలీలు పోస్టాఫీసు దగ్గర ఖాతా పుస్తకాలతో నిరసనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఐద్వా సంఘం జిల్లా నాయకురాలు నర్మద పోస్టాఫీసు దగ్గరకు చేరుకుని, ఆందోళన చేస్తున్న వారికి మద్దుతు తెలిపారు. భోజన విరామం వరకు ఆందోళన చేసి వెళ్లి పోయారు.



పోస్టాఫీసు దగ్గర ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

విత్తన దుకాణాల్లో తనిఖీలు

అయిజ: మండల కేంద్రంలోని విత్తన విక్రయ దుకాణాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు, మందు డబ్బాలు, విత్తనాల ప్యాకెట్లను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని, నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కొనుగోలు చేసిన రైతులకు దుకాణాల యజమానులకు రశీదులను ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారి నాగేశ్వర్‌రావు, ఏఎస్ఐ అమర్, ఎంఏఓ శంకర్‌లాల్ పాల్గొన్నారు.



విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆలయాల్లో అమావాస్య పూజలు



పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో గురువారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి, కోతులగిద్ద అరణేశ్వరస్వామి, అల్వాలపాడులోని తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ధరూరులో సీతారాములు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులు తమ వాహనాలకు అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు.

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామికి అభిషేకం, ఆకు పూజ నిర్వహించారు. ఆలయం చుట్టు సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం భీమవారం గ్రామస్తులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలోని వెలసిన శ్రీ పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు దాసంగాలు పెట్టారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



ధరూరు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో భోజనాల వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాంతినగర్‌లోని రామాలయం, మారుతీ నగర్‌లోని ఆంజనేయస్వామివారి ఆలయం, కన్యకాపరమేశ్వరిదేవీ ఆలయం, మండలంలోని జూలెకల్ ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో వెలసిన శివాలయం, అభయాంజనేయస్వామివారి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఆలయ అర్చకులు వినయ్‌కౌశిల్‌శర్మ గోమాతకు నూతన వస్త్రం కప్పి మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశుగ్రాసం, పండ్లు గోమాతకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

యువతరానికి ఆదర్శంగా ఉండాలి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పూర్వపు విద్యార్థులు రాబోయే యువతరానికి ఆదర్శంగా ఉండాలని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, గత ప్రిన్సిపాల్ దేవానందం అన్నారు. గురువారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి గురుకుల పాఠశాలలో 2004కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా తమ మిత్రుడు కీ.శే. డాక్టర్ మహేష్ /జ్ఞాపకార్థం పాఠశాలకు అవసరమైన ఫ్రిజ్, ప్రొజెక్టర్, ఇన్వర్టర్‌లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ఇన్వర్టర్, నేటి తరానికి అవసరమైన కంప్యూటర్ విద్యకోసం ప్రొజెక్టర్, విద్యార్థులకు అవసరమైన మెడికల్ సదుపాయం కోసం ఫ్రిజ్‌ను అందించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో గురుకుల పూర్వ విద్యార్థులు